సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం: భీమిలి మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా అధికారులు చూడాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. ఆదివారంమండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ ప్రాంతాల్లో కుళాయి కనెక్షన్‌లు వేయాలని కోరారు. దీనికి స్పందించిన గ్రామీణ నీటి సరఫరా విభాగ ఏఈ దుర్గా భవాని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధ్రువ పత్రాల జారీ విషయంలో తహశీల్దారు కార్యాలయంలో చాలా జాప్యం జరుగుతోందని దీనివల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. తహశీల్దారు స్పందిస్తూ దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గృహనిర్మాణశాఖ ఏఈ హుస్సేన్ , మండల విద్యాశాఖ అధికారి శివరాణి మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీడీవో హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరంలోని మాక్‌డ్యాన్స్ స్టుడియో కళాకారులు అద్భుత నృత్య విన్యాసాలతో అలరించారు. మహాగణపతి నృత్యాంశంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో అయిగిరి నందిని గీతానికి ప్రదర్శించిన నృత్య రూపకం ప్రత్యేకతగా నిలిచింది. కళాకారులు చైత్ర, హారిక, గాయత్రీ, మనోజ్ఞ, రోహిత, లక్ష్మి, ప్రణతి, ఈశ్వరి, దీపిక తదితర కళాకారులు పాల్గొనగా అన్నపూర్ణ నృత్య దర్శకత్వం వహించారు.

అమ్మవారి ఉత్సవ చాటింపు



ఊరేగిస్తున్న అమ్మవారి గరగ

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మవారి ఉత్సవ చాటింపు వేడుక శనివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద తంగేడు పూలతో అలంకరించిన గరగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి పెద్దబజారు, మెయిన్‌రోడ్డు, చిన్నబజారు ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో రాగా ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం ఉదయం మెయిన్‌రోడ్డు వద్దనున్న అమ్మవారి చదునుపట్టు వద్ద గరగను ఉంచారు, ఉత్సవాలు అయ్యేంతవరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు .

ఘనంగా వరకవి సన్యాసిదాసు వర్ధంతి



సన్యాసిదాసుకు నివాళులర్పిస్తున్న శిష్యబృందం

తగరపువలస: కవి, గాయకుడు, కవి పంచానన బిరుదాంకితుడు సింగారపు వరకవి సన్యాసిదాసు 23వ వర్ధంతి సందర్భంగా ఆదివారం శ్రీకుసుమహర సంతపేటలో ఆయన శిష్య బృందం ఘనంగా నివాళులు అర్పించింది. ముందుగా దుబ్బ సూర్యనారాయణ, పెద్ద రామారావులచే సన్యాసిదాసు చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సంతపేట, రఘుమండ, చిల్లపేట, పాతపాలెం, భీమిలి, అమనాం, చెరకుపల్లి, గుడివాడ, విజయనగరంప్రాంతాలకు చెందిన 9 భజన బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఊడికల చిరంజీవి, రవ్వ ఆనంద్, రవ్వ అప్పలనరసయ్య, తిరుపతి రావు, చిల్ల సూరిబాబు, చేట్ల అప్పలరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, గోవిందరెడ్డి, బెల్లాన ప్రకాశ్, అప్పలనారాయణ, సూరప్పడు, నరసింగరావు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప..పేదలు నివాసముండే సముదాయం. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధురవాడ జోన్ 5వ వార్డులోని జేఎన్ఎన్‌యూఆర్‌ఎం(రాజీవ్ గృహకల్ప)కాలనీ పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. గృహసముదాలకు చెందిన పైప్‌లైన్లు పగిలిపోవడంతో మురుగంతా ఆరుబయట నిల్వ ఉండిపోతోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. **వలువురు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో మా బతుకులు ఇంతేనంటూ బేలచూపులు చూస్తున్నారు.** – మధురవాడ

దుర్గంధం.. దుర్భరం

- ‘రాజీవ్ గృహకల్ప’లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం
- నివాసాల చెంతనే మురుగు నిల్వ
- దుర్వాసన, ఈగలు, దోమలతో తీవ్ర ఇబ్బంది
- ప్రతి ఇంట్లోనూ జ్వరబాధితులే..
- మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలోపై చిన్నచూపు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, పాలకులు



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సక్రమంగా లేని రాజీవ్ గృహకల్ప కాలనీ

వార్డు : జీవీఎంసీ 5వ వార్డు
కాలనీ : జేఎన్ఎన్‌యూఆర్‌ఎం ఆర్‌జీకే కాలనీ, మారికవలస
బ్లాకులు :167
నివాసాలు : 5,344
జనాభా : సుమారు 16 వేలు

గృహసముదాయంలో **167 బ్లాకుల్లో 5,344 నివాసాలు** ఉండగా సుమారు **16 వేల మంది నివాసం** ఉంటున్నారు. ఇక్కడున్న**వారంతా నిరుపేదలే.** రెక్కాడితే గాని డొక్కాడని **పరిస్థితి వీరిది. దీంతో** అటు అధికారులు..ఇటు **పాలకులు పట్టించుకో**వడం లేదు. కేవలం ఎన్నిక**ల సమయంలో** మాత్రమే ఓట్లు కోసం కోటి **దండాలు** పెడుతున్నారు. ఆ తరువాత మొహం చాటేస్తున్నారు. గృహసముదాయాలనుంచి మురుగునీరు అండర్ డ్రైనేజీ ద్వారా బయటకు పోయే వ్యవస్థ దాదాపు 70 శాతం దెబ్బతింది. అత్యధిక నివాసాలకు చెందిన పైపులైన్‌లు పగిలిపోయి మురుగునీరు ఆయా నివాసాల చెంతనే నిల్వ ఉండిపోతోంది. దీంతో చాలా నివాసాలు వద్ద మురుగు గుంటలు ఏర్పడ్డాయి.

ఏ ఇంట్లో చూసినా జ్వరపీడితులే..

ఈ మురుగునీరు వలన వచ్చే ఈగలు, దోమలు, అపారిశుధ్యంతో పలువురు వ్యాధులు బారిన **పడుతున్నారు.** దీంతో ఎక్కడ చూసినా జ్వరాలు, ఇతర సమస్యలతో బాధపడుతున్న వారే దర్శనం ఇస్తున్నారు. మరికొన్ని నివాసాల్లో ఇంట్లో ఉన్న వారంతా ఏదో ఆరోగ్య సమస్యలతో అవస్థలు పడుతున్నారు.

కొత్త పైప్‌లైన్లు వేయాలి

అండర్ డ్రైనేజీకి ఉన్న పైపులైన్‌లు చాలా చోట్ల పగిలిపోయాయి. పగిలిపోయిన పైపుల స్థానంలో **కొత్తవి ఏర్పాటు చేయాలి.** మరమ్మతులకు గురైన మ్యాన్‌హోల్స్ శుభ్రం చేయించాలి. మురుగు గుంటల వద్ద బ్లీచింగ్, ఫాగింగ్ వంటివి వెంటనే చేపట్టాలి. గృహసముదాయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాలు, ఇతర వ్యాధులతో బాధ పడుతున్న వారికి చికిత్స అందించాలి.

అధికారులూ..నేతలూ మీరెక్కడ

గృహసముదాయంలో సుమారు 16 వేల మంది నివసిస్తున్నారు. చాలా సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. అయినా కాలనీవైపు అధికారులు, నాయకులు కన్నెత్తి చూడడం లేదు. మురుగు ఎక్కడబడితే అక్కడ నిలిచిపోతోంది. శానిటేషన్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. నాయకుల వద్ద మొరపెట్టుకున్నా హామీలిస్తున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదు. అధికారులు, నాయకులు పట్టించుకోకపోతే 16వేల మంది కలిసి ఆందోళన చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.



అపారిశుధ్యం కారణంగా మంచం పట్టిన మహిళ



133 బ్లాకు సమీపంలో నిరుపయోగంగా మ్యాన్ హోల్



నివాసాల వద్ద నిలిచిపోయిన మురుగు



మ్యాన్ హోల్ పగిలిపోయి ప్రవహిస్తున్న మురుగు

ఉన్నతాధికారులు స్పందించాలి



అధికారులకు తాము చెప్పే మాటలు నమ్మకపోతే జ్వరాలు ఇతర ఇబ్బందులతో చికిత్స పొందుతున్న రిపోర్టులు అందజేస్తాం. గృహసముదాయంలో ఉన్న సమస్యలు పరిష్కరిండి. లేకపోతే జ్వరపీడితులంతా కలిసి ఆందోళన చేయడానికి వెనుకాడబోం. కొత్తకాలనీలోని 160 నుంచి 166 బ్లాకుల మధ్య పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కనీసం ఉన్నతాధికారులు అయినా స్పందించాలి.

–గాయత్రి, కాలనీవాసి,

ఇంట్లో అందరూ జ్వరపీడితులే..

యూజీడీ మ్యాన్ హోల్స్‌లో నుంచి మురుగునీరు పారడం లేదు. మా ఇళ్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. భరించలేని దుర్వాసనతో జ్వరాలు, ఇతర జబ్బులు వస్తున్నాయి. మా ఇంట్లో ముగ్గురికీ జ్వరాలే. అంతా ఇంట్లో ఉండిపోవడంతో పనులకు వెళ్లలేకపోతున్నాం. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పనికి వెళ్తేగానీ పూటగడవని పరిస్థితి. తాము జ్వరాలతో ఎన్నిరోజులు ఇలా ఇబ్బందులు పడాలో అర్థం కావడం లేదు.

–కణితి నాగు, బాధితుడు

యూడీజీ సెక్షన్ వాళ్లు చూడాలి

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులు, ఇతర పనులు చేయాల్సిన పని యూజీడీ సెక్షన్ వాళ్లది. చాలా చోట్ల ఇలాంటి ఇబ్బందులు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. యూజీడీ అధికారుల దృష్టికి రాజీవ్ గృహకల్ప సమస్యలను తీసుకువెళతాం.

–కాకర శ్రీను, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జీవీఎంసీ 5వ వార్డు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

- 9 నెలల్లోనే కూటమిపై ప్రజల్లో అసంతృప్తి
- వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చిన్న శ్రీను

కొమ్మాది: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మూలకు చేరి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని భీమిలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చిన్న శ్రీను అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి చెప్పిన మాయ మాటలు నమ్మి రాష్ట్ర ప్రజలు మోసపోయారని, అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. అభివృద్ధిని, సంక్షేమ పథకాలు అమలు చేయలేక చేతులెత్తేసిన ప్రభుత్వం దౌర్జన్యాలు, దోపిడీలకు పాల్పడుతోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ చేసిన అభివృద్ధి పనులు వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకుని కూటమి ఖాతాలోకి వేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు దగ్గర నుంచి ఫిషింగ్ హార్బర్ నిర్మాణాల వరకు గత ప్రభుత్వం చేసింది తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని గుర్తు చేశారు.

కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు : వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తారని అన్నారు. జగన్ ఆదేశాల మేరకే భీమిలి నియోజవర్గానికి సమన్వయకర్తగా వచ్చానని, భీమిలికి పూర్వ వైభవం తీసుకుని వస్తానన్నారు. ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని నిలబెట్టే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త తీసుకోవాలన్నారు. అదే విధంగా ఈ వార్డులో ఉన్న కె.నగరపాలెం, కాపులుప్పాడ, నిడిగట్టు, జేవి అగ్రహారం, చేపలుప్పాడ ప్రాంతాల్లో నూతన కమిటీలు నియమించి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, 4వ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దాట్ల పెదబాబు, ఎలమంచిలి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ ఎరుసు అప్పలకొండ, బోర రామకృష్ణ, చిన్నారావు, రాములప్పడు, మైలపల్లి షన్ముఖరావు, నాగోతు సింగన్న, అప్పన్న, డి. అచ్యుత్, విష్ణు, దాసు, వేముల ఈశ్వర్‌రెడ్డి, సాడిరమణ, దుంప సత్యం, శివ, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

103 మంది రక్తదానం



51సార్లు రక్తదానం చేసిన బసవ కృష్ణమూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

భీమునిపట్నం: భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్ వద్ద మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఇందులో 103మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 25వసారి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తుంచామన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 51 సార్లు రక్తదానం చేసిన రాజేటి బసవ కృష్ణమూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు కొత్త రామకృష్ణ, మైలిపల్లి షణ్ముఖరావు, కాళ్ల సన్నీ, అడిదం కిశోర్, తామాడ శ్రీను పాల్గొన్నారు.

పోక్సో చట్టం చాలా పవర్‌ఫుల్



మాట్లాడుతున్న భీమిలి మెజిస్ట్రేట్ సౌజన్య

పద్మనాభం: మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన శిక్షలు విధిస్తామని భీమునిపట్నం కోర్టు మెజిస్ట్రేట్ సౌజన్య హెచ్చరించారు. మండలంలోని మద్దిలో ఆదివారం న్యాయ విజ్ఞానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చిన్న పిల్లలను లైంగిక వేధింపుల బారి నుంచి రక్షించడానికి 2012లో పోక్సో చట్టం చేశారన్నారు. పోక్స్ కేసు నమోదైతే తప్పనిసరిగా శిక్ష పడుతుందన్నారు. ఒకసారి కేసు నమోదు అయితే బాధితులు కేసు విత్‌డ్రా చేసుకోవడానికి కూడా అవకాశం ఉండదన్నారు. పోక్స్ కేసులను త్వరితగతిన తీర్పు చెపుతారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికపై నిఘా వేసి ఉంచాలన్నారు. పిల్లలు చెప్పిన సమస్యలను గాలికి వదిలేయకుండా పరిష్కరించాలన్నారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు విద్యార్థి దశలోనే పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం బాధాకరమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంట్రోల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్, న్యాయవాదుల నమ్మి సూరిబాబు, రామారావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు పాల్గొన్నారు.

హోటళ్లు, రిసార్టుల యజమానులతో సీఐ భేటీ



హోటళ్ల యజమానులతో మాట్లాడుతున్న ఆనందపురం సీఐ వాసునాయుడు

తగరపువలస: ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో సీఐ చింతల వాసునాయుడు ఆదివారం మండలంలోని హోటళ్లు, రిసార్టులు, లాడ్జీల యజమానులతో సమావేశం అయ్యారు. ఇటీవల నేరస్తులు లాడ్జీలు, రిసార్టులను అడ్డా చేసుకుని పాల్పడుతున్న అసాంఘిక కార్యకలాపాలను ఉదహరించారు. బయట వ్యక్తులు అద్దెకు వచ్చినప్పుడు వారి నుంచి పూర్తి సమాచారం సేకరించాలన్నారు. ఐడెంటిటీ కార్డులు, ఆధార్ కార్డులు, ఫొటోలు, ఫోన్ నంబర్లు భద్రపరచాలన్నారు. అద్దెకు దిగేవారు అసాంఘిక కార్యకలాపాలైన పేకాట, వ్యభిచారం వంటివి నిర్వహించకుండా యజమానులే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా వ్యక్తులపై అనుమానం కలిగితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్నారు. వారి ఫోన్ నంబర్లు తీసుకుని పోలీస్ స్టేషన్, సిబ్బంది నంబర్లు వారికి ఇచ్చారు.

నేటి నుంచి తునివలసలో బంగారమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని తునివలసలో సోమవారం నుంచి తొలేళ్లతో బంగారమ్మ ఉత్సవాలు జరుగుతాయి. తొలేళ్లలో భాగంగా రథాలను గ్రామంలో ఊరిగిస్తారు. మంగళవారం అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగిస్తారు. బుధవారం ముగింపు ఉత్సవం జరుగుతుంది. అమ్మవారి ఆలయానికి , ఆలయ పరిసర ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేశారు.

అమరజీవికి ఘన నివాళి



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది

పీఎంపాలెం: ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష బూని తనువు చాలించిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతిని బక్కన్నపాలెం ఏపీఎస్‌పీ 16వ పోలీస్ బెటాలియన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీ కృష్ణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బెటిలియన్ ఎస్‌డీఆర్ఎఫ్‌కు నూతనంగా మంజూరు చేసిన రెస్క్యూ డ్రోన్‌ను కమాండెంట్ మురళీ కృష్ణ ఆదివారం ప్రారంభించారు. బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్ వీ.నారాయణరావు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆదర్శ హిందీప్రేమీ మండలిలో..

తగరపువలస: అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా ఆదివారం భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలిలో నిర్వహించారు. అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు.

ఎయిర్‌పోర్టు రహదారులపై ఎమ్మెల్యే గంటా సమీక్ష

తగరపువలస: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సులువుగా చేరుకునేందుకు చర్యలు తీసుకోవాల ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వీఎంఆర్డీఏ అధికారులకు సూచించారు. ఆదివారం నగరంలోని తన నివాసంలో ఆయన వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవగోపాల్, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రజలు సౌకర్యవంతంగా, సులభంగా చేరుకునేలా తీర్చిదిద్దాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా

తగరపువలస: చిట్టివలస సెక్షన్ పరిధిలో రూ.3 కోట్లతో భీమిలి రోడ్డు రజక సంతపేటలో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజీ లేకుండా నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఈ సబ్ స్టేషన్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ సూపరెంటిండెంట్ ఇంజినీర్ జి.శ్యాంబాబు, జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు, భీమిలి సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇం.ఇనీర్ రొంగలి రమేష్, భీమిలి సబ్ డివిజన్ అసిస్టెంట్ ఇంజినీర్లు బొట్టా రవి, యు.సకరయ్య, హరిప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌కు ఏడాది క్రితమే భూమిపూజ: గత ఏడాది మార్చి 15న ఇదే స్థలంలో రూ.2.55 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిలాఫలకం ఆవిష్కరించారు. తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు వాయిదా పడ్డాయి. తిరిగి అదే చోట అదే సబ్ స్టేషన్ నిర్మాణానికి రెండోసారి శిలాఫలకం వేయడంతో స్థానికులు విస్తుపోతున్నారు. శనివారం వరకు ఉన్న పాత శిలాఫలకాన్ని ఆదివారం తొలగించి గంటా శ్రీనివాసరావుతో రెడీమేడ్ శిలాఫలకం ఆవిష్కరించి దానిని కూడా పట్టుకుపోవడం గమనార్హం.

భారీ అన్నసమారాధన

తగరపువలస: ఇటీవల సంగివలస కొత్తమ్మతల్లి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ముగిసిన వార్షిక జాతర మహోత్సవాలలో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈవో డీవీఎస్ సురేష్ బాబా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ

భీమునిపట్నం: భీమిలిలోని కలిగొట్ల స్విగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టీజే మోహన్ రోగులను పరీక్షించి 80 మందికి మందులు అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయము, వేములవలస

రేఖా నెం.18/2025 తేది: 15-03-2025

సీల్డు టెండరు-కం- బహిరంగ వేలము ప్రకటన

విశాఖపట్నం జిల్లా, ఆనందపురం మండలం, వేములవలస గ్రామ పంచాయితీ యొక్క మహాత్మాగాంధీ రోజువారీ మార్కెట్టు నందు ఆశీలు రుసుములు వసూలు చేసుకొను హక్కు 2025-26 సం॥నకు సీల్డు టెండరు-కం-బహిరంగ వేలము **తేది: 19-03-2025 బుధవారం జరుపబడును. తేది : 19-03-2025 ఉదయము గం॥10.30 ని॥ల నుండి మధ్యాహ్నం గం॥ 12.00 వరకు** సీలు వేసిన టెండర్లు ఈ గ్రామ పంచాయితీ కార్యాలయము నందు ఈ దిగువ సంతకముదారునిచే గాని, అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. సీలు వేసిన టెండర్లు దాఖలు చేయువారు ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన ధరావత్తు మొత్తము భారతీయ స్టేటు బ్యాంకు, భీమునిపట్నం శాఖనందు జమ అగునట్లుగా గ్రామ పంచాయతీ, వేములవలస అనుపేరు మీద డిమాండు డ్రాఫ్టు తీసుకొని జతపరచవలెను. శ్రీ తహసీల్దారు వారి నుండి "సాల్వెన్సీ సర్టిఫికెటు" లేదా బ్యాంకు గ్యారంటీ టెండరుకు జతపర్చవలెను మరియు ఈ గ్రామ పంచాయతీ మహాత్మాగాంధీ రోజువారీ మార్కెట్టు నోటిఫికేషను నందలి నిబంధనలు మరియు షెడ్యూలు నందలి ధరలకు లోబడి మాత్రమే సీలు వేసిన టెండర్లు దాఖలు చేయవలెను మరియు బహిరంగ వేలములో పాల్గొనవచ్చును. రోజువారీ మార్కెట్టు నోటిఫికేషన్ ఈ గ్రామ పంచాయతీ నోటీసు బోర్డు నందు ప్రచురించబడును. మరియు ఈ గ్రామ పంచాయతీ పని దినములలో, పనివేళలలో వచ్చి పొందవచ్చును. పైన తెలిపిన విధముగా దాఖలు కాబడిన సీల్డు టెండర్లు మాత్రమే పరిగణలోనికి తీసుకొనబడును. సీల్డు టెండర్ల స్వీకరణ అనంతరము అదేరోజు మధ్యాహ్నము గం॥1.00 నుండి ఈ గ్రామ పంచాయతీ కార్యాలయము వద్ద ఈ దిగువ సంతకముదారునిచే గాని, వారిచే అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. బహిరంగ వేలములో పాల్గొనుటకు అర్హత కలిగిన వారు షెడ్యూలు నందు చూపిన ధరావత్తు మొత్తము పైన తెలిపిన విధముగా డిమాండు డ్రాఫ్టు ద్వారా లేక నగదు రూపములో చెల్లించి, రోజువారీ మార్కెట్టు నిబంధనలకు, షెడ్యూలు ధరలకు అంగీకరించి, శ్రీ తహసీల్దారు వారి నుండి "సాల్వెన్సీ ధృవపత్రము" లేక బ్యాంకు గ్యారంటీ పొంది, వేలము పాట కాలములో దాఖలు చేసిన వేలము పాటలో పాల్గొనవలెను. బహిరంగ వేలము పాట పూర్తి అయిన పిదప, ఎక్కువ మొత్తంలో పాటపాడిన గుత్తేదారుని పాటను అప్పగించవలెనన్న అంతకు ముందుగా వేయబడిన సీల్డు టెండరుదారులు మరియు బహిరంగ వేలము పాటదారుల సమక్షములో సీలు వేసిన టెండర్లు తెరువబడును. సీలు వేసిన టెండరు నందు నమోదు చేసిన టెండరు మరియు బహిరంగ వేలం నందు వచ్చిన అధిక మొత్తం పాట పాడిన గుత్తేదారుని పాట, ఈ రెండింటిలో ఏది ఎక్కువ పాట పాడివుంటే ఆ గుత్తేదారుని పాటను నిర్ధారించుటకు గ్రామ పంచాయతీ వారి ఆమోదమునకు లోబడి అధిక మొత్తంలో పాడిన గుత్తేదారుని పాటను ఆమోదించబడును. గ్రామ పంచాయతీ వారి ఆమోదం అనంతరం అధిక మొత్తంలో పాడిన గుత్తేదారుని పాటను ఖాయపరచబడిన గుత్తేదారుని ప్రథమ ధరావత్తుతో కలుపుకొని పాట మొత్తంలో 1/3 వంతు సొమ్ము చెల్లించి, నిబంధనల ప్రకారం అగ్రిమెంటు వ్రాసి, రిజిస్టర్ చేయించి ఇవ్వవలెను. మరియు గ్రామ పంచాయతీ తెలియజేయబడిన వాయిదాలకు సరిపడ భారతీయ స్టేటు బ్యాంకు వారి ముందస్తు చెక్కులు ఇవ్వవలెను. 1/3 వంతు పోను మిగిలిన మొత్తము ఈ కార్యాలయము నుండి తెలిపిన విధముగా ఈ గ్రామ పంచాయతీ కార్యాలయము నందు చెల్లించి తగు రసీదు పొందవలెను. ఇందులకు సంబంధించిన షరతులు వగైరాలు ఈ గ్రామ పంచాయితీ పనిదినములలో, కార్యాలయపు పనివేళలలో వచ్చి తెలుసుకొనవచ్చును. ఎటువంటి ముందస్తు నోటీసు జారీ చేయకనే ఈ సీల్డు టెండరు-కం-బహిరంగ వేలం వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని ఈ దిగువ సంతకముదారునికి అధికారము గలదు.

షెడ్యూలు

వ.నెం.	వేలము పాట వివరము	ధరావత్తు రూ॥లు
1	వేములవలస గ్రామ పంచాయితీ ఈ యొక్క మహాత్మాగాంధీ రోజువారీ మార్కెట్టు నందు 2025-26 సం.నకు ఆశీలు రుసుములు వసూలు చేసుకొను హక్కు సీల్డు టెండరు-కం-బహిరంగ వేలము వేయుట.	రూ॥ 2,00,000.00 (అక్షరాల రెండు లక్షల రూపాయలు మాత్రమే)

గమనిక : 1. సాల్వెన్సీ / బ్యాంకు గ్యారంటీ 2. సెక్యూరిటీ డిపాజిట్ **రూ.20,00,000/-** (అక్షరములా ఇరవై లక్షల రూపాయలు క్యాష్ / డి.డి.) తప్పనిసరిగా పాట కాలమునందు సమర్పించి పాటనందు పాల్గొనుటకు చెల్లించవలెను. సాల్వెన్సీ / బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ (క్యాష్ / డి.డి.) లేనిచో పాటనందు పాల్గొనుటకు అనర్హులు.

ఈ సీల్డ్ టెండరు కం బహిరంగ వేలం ప్రకటన గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీసు బోర్డు నందు మరియు ముఖ్య ప్రదేశములలో ప్రచురించడమైనది.

సం॥ **లంక కొండమ్మ**, సర్పంచ్, గ్రామ పంచాయతీ, వేములవలస

సం॥ **పంచాయతీ కార్యదర్శి**, గ్రామ పంచాయితీ, వేములవలస